బాటిల్ బాంబ్



మార్కెట్లను ముంచెత్తుతున్న ప్లాస్టిక్ బాటిళ్లు

ఆరోగ్యాన్ని హరించే ప్లాస్టిక్ బాటిళ్లు

ప్రజల నిత్య జీవితంలో భాగమైపోయిన ప్లాస్టిక్

తక్షణం విడనాడాలంటున్న నిపుణులు

దాబాగార్డెన్స్: పాత ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించడమంటే కొత్త రోగాలు కొని తెచ్చుకోవడమే. వాటిని తయారు చేయడంలో వినియోగించే విషపూరిత రసాయనాలే దీనికి కారణం. ప్లాస్టిక్ బాటిళ్లను ఎక్కువ రోజులు వినియోగిస్తే సంతానోత్పత్తిపైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వివిధ రకాల క్యాన్సర్ల బారిన పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇంతటి ప్రమాదకరమైన ప్లాస్టిక్ బాటిళ్లు నేడు గ్రామాల నుంచి నగరాల వరకు విరివిగా ఉపయోగించడం ఆందోళన కలిగించే అంశం.

ప్లాస్టిక్‌తో పొంచి ఉన్న ప్రమాదం..

ప్రస్తుత రోజుల్లో ప్రతి దానికి ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్నాం. వీటి వల్ల అనేక దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉంది. విపరీతంగా ప్లాస్టిక్ వాడడం వల్ల పురుషులు, స్త్రీలలో సంతానోత్పత్తి తగ్గిపోతుంది. అంతే కాకుండా కాలేయం, ప్రోస్టేట్ క్యాన్సర్ వస్తాయి. సీసాల్లో ఉండే బిస్‌ఫెనాల్ అనే రసాయనం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.



భూతద్దంలో కనిపిస్తున్న బాటిల్‌లోని బాక్టీరియా

80 శాతం మంది ఇంటి నుంచే..

జిల్లాలో విద్యార్థులు మొదలుకొని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు 80 శాతం మంది నీటిని ఇంటి నుంచే తీసుకెళ్తుంటారు. ప్లాస్టిక్ ప్రమాదమని తెలిసే వారు వాటినే వాడుతుంటారు. పలు పాఠశాలల్లో మినరల్ వాటర్ సదుపాయం లేకపోవడం వల్ల ఇంటి నుంచే ప్లాస్టిక్ సీసాల్లో నీటిని తీసుకెళ్లి తాగుతుంటారు. వేసవి సెలవుల్లో ఆటపాటల్లో మునిగిపోతూ ప్లాస్టిక్ సీసాల్లో నీటిని వెంట తీసుకెళ్తుంటారు. ఇది మంచిది కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

మోతాదుకు మించి అవశేషాలు..

వాటర్ బాటిళ్లలో నీరు నిల్వ ఉండడం అత్యంత ప్రమాదకరం. భారతదేశంతో పాటు అమెరికా, కెన్యా, ఇండోనేషియా, చైనా దేశాల్లో వివిధ బ్రాండ్లకు చెందిన 200కు పైగా ప్లాస్టిక్ బాటిళ్లను పరిశీలించిన శాస్త్రవేత్తలు వాటర్ బాటిళ్లలో సగానికి సగం బాటిళ్లలో మోతాదుకు మించి ప్లాస్టిక్ అవశేషాలు ఉన్నట్టు తేల్చారు.

రెండు నెలలు మించి వాడకూడదు..

ఒక ప్లాస్టిక్ సీసా రెండు నెలలకు మించి వాడకూడదు. అదే విధంగా వేడి నీటిని సీసాల్లో తీసుకెళ్లకూడదు. వాటర్ బాటిళ్లను ఎండ తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఆ వేడి వల్ల విషపూరిత రసాయనాలు నీటిలోకి చేరి వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఈ విషయం తల్లిదండ్రులు తెలుసుకుని పిల్లలకు వివరించాల్సిన అవసరం ఉంది.

జాగ్రత్తలు అవసరం..

- సీసాల్లో ఎట్టి పరిస్థితుల్లో వేడి నీరు పోయరాదు. స్కూళ్లకు వెళ్లే చిన్నారులకు ఎట్టి పరిస్థితిలోనూ వేడి నీటిని సీసాల్లో నింపి ఇవ్వకూడదు.
- చిన్నారులకు ప్లాస్టిక్ సీసాల్లో నీరు తాగడం వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండేలా చూడాలి.
- ప్లాస్టిక్‌కు బదులు రాగి సీసాలు వినియోగించడం ఉత్తమం.



ఇలా ప్లాస్టిక్ బాటిల్‌లో నీళ్లు పట్టుకుని తాగడం ప్రమాదకరం

వేసవిలో వాడకం అధికం..

వేసవిలో ప్లాస్టిక్ సీసాల వాడకం పెరుగుతోంది. చల్లటి నీటి కోసం ఈ ప్లాస్టిక్ సీసాలను వినియోగిస్తున్నారు. వివిధ కంపెనీల వాటర్ బాటిళ్లు ఒకసారి మాత్రమే వినియోగించాలి. అయితే రిఫ్రిజిరేటర్‌లో వీటిని ఎక్కువ మంది వినియోగిస్తున్నారు. ఇలా వినియోగించడం వల్ల వ్యాధుల బారిన పడకతప్పదు.

తాగే నీరు కలుషితం..

సీసాలు పరిశుభ్రంగా లేకుంటే తాగే నీరు కలుషితమవుతుంది. ఫలితంగా వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇటువంటి సమస్యలు చిన్నారుల్లో అధికంగా కనిపిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని, ఎక్కువ రోజులు ప్లాస్టిక్ సీసాల్లోని నీరు తాగితే క్యాన్సర్, చర్మ, కాలేయ సమస్యలు తలెత్తుతాయి. ఆడపిల్లల్లో గర్భస్థ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

40 కేజీల నిషేధిత ప్లాస్టిక్ పట్టివేత



ప్లాస్టిక్ కవర్ల అమ్మకందారులపై దాడులు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వ్యాపార సముదాయాలపై జీవీఎంసీ ప్రత్యేక బృందాలు దాడులు చేసి 40 కేజీల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నాయి. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణా మార్కెట్‌లో హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు చేశారు. ఈ మేరకు ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు మాట్లాడుతూ మానవాళికి హాని కలిగించే ప్లాస్టిక్‌పై జీవీఎంసీ నిషేధం విధించిందన్నారు. అయినప్పటికీ వ్యాపారులు ప్లాస్టిక్ ఉపయోగిస్తూనే ఉన్నారన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు దొరికితే వెంటనే ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మురళి, గంగాధర్, రంగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్ కలాసీలకు టైం స్కేల్ అమలుకు హామీ



పోర్టు కార్యాలయం ముందు హర్షం వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు, కలాసీలు

జగదాంబ: విశాఖ పోర్ట్ పూల్ కలాసీలకు టైం స్కేల్ అమలు చేస్తామని పోర్ట్ చైర్మన్ హామీ ఇచ్చారని పూల్ కలాసీల జిల్లా అధ్యక్షుడు పరుశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోర్టు పూల్ కలాసీలతో కలిసి చైర్మన్‌తో మాట్లాడి వినతి పత్రం అందజేశారు. కలాసీలు పోర్ట్‌ను నమ్ముకుని చాలా కాలంగా జీవిస్తున్నారని తెలిపారు. వారందరికీ టైం స్కేల్, మెడికల్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ కలాసీలకు టైం స్కేల్ అమలు చేస్తామని హామీ ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్‌కుమార్, జుంజూరు గోవింద్, యూనియన్ నాయకులు రాము, రమేష్, భీమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన దినత్రయ పారాయణం



ముగింపు కార్యక్రమంలో వేదపండితులు

దాబాగార్డెన్స్: తిరుమల తిరుపతి దేవస్థానం గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠీ ఆధ్వర్యంలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపాన చెంగల్రావుపేట కోదండరామ అలియాస్ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి నిర్వహించిన దినత్రయ పారాయణం మంగళవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు వేదపండితులచే వేదపారాయణ నిర్వహించారు. లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ దుర్భిక్షం లేకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలనే ఆకాంక్షతో నిర్వహించిన దినత్రయ పారాయణంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు వేదపండితులు, కోదండరామస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



కాలభైరవ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసిన కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మలు భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ ఆఫ్ ది ఇయర్ కిరీటం గెలుచుకున్న హరిణి చౌదరి



గ్లోబల్ ఈవెంట్‌కి ఎంపికైన చిన్నారి హరిణి చౌదరీ

దాబాగార్డెన్స్: జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ గోవా ఇండియన్ ఫైనల్స్‌లో ప్రతిష్టాత్మక ఫేస్ ఆఫ్ ది ఇయర్ బిరుదును విశాఖకు చెందిన ఆరేళ్ల హరిణి చౌదరీ కైవసం చేసుకుంది. గోవా ది నైట్ క్లబ్‌లో మూడు రోజుల పాటు జరిగిన పలు రౌండ్లలో అసాధారణ ప్రతిభ చూపి విజయం సాధించడంతో, ఆగస్టులో వియత్నాంలో జరగనున్న వరల్డ్ ఫైనల్స్‌కు ఎంపికైంది. ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా చిన్నారి ప్రశంసలు అందుకుంది. విశాఖలో నిర్వహించిన స్టార్‌కిడ్స్‌లో కూడా హరిణి రన్నరప్‌గా నిలిచింది. గ్లోబల్ ఈవెంట్‌లో హరిణి చౌదరి విజయం సాధించాలని పలువురు ఆకాంక్షించారు.

వార్డు సమస్యలపై ఎమ్మెల్యే స్పందించకపోవడం దారుణం



వార్డు పరిధిలో అవసరమైన చోట విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 41వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందించకపోవడం దారుణమని ఆ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అన్నారు. వార్డు పరిధిలో స్థానికులతో కలిసి అవసరమైన చోట జీవీఎంసీ విద్యుత్ సిబ్బందితో 70 విద్యుత్ దీపాలు మంగళవారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌కు సమీపాన 41వ వార్డు ఉండడంతో జ్ఞానాపురంలో పలు ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, బయటి నుంచి వచ్చి, ఇక్కడే గంజాయి, మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చెప్పారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని చీకటి మయంగా ఉన్న వీధుల్లో నూతన లైట్లు వేయాలని గత కౌన్సిల్లోనే మేయర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఫలితంగా 70 విద్యుత్ లైట్లు మంజూరయ్యాయని, మరో 20 అవసరం ఉందని చెప్పారు. అలాగే జ్ఞానాపురంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు పూర్తిగా కలుషితమవుతుందని, డ్రైనేజీ సమస్యతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉందని, స్థానికులు డెంగ్యూ, విషజ్వరాలతో బాధపడుతున్నారని చెప్పారు. తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానిక సమస్యలపై కార్పొరేటర్‌తో కలిసి వార్డు విజిట్ చేయాలని కోరారు. స్థానిక నాయకులు ప్రజల నుంచి కాసులు దండుకుంటున్నారని ఆరోపించారు. దళారీ వ్యవస్థ నిర్మూలించి, ప్రజలకు అవినీతిరహిత పాలన అందించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు వేకంగణిరావు, కుమార్, సెబాస్టియన్ కాలనీ వాసులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ ఎంట్రీలో లోపాలు సవరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: భెల్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం పీఎఫ్ (అదాలత్) నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ 1992 నుంచి వివిధ సిరీస్‌లో జాయిన్ అయిన ఉద్యోగులకు డేట్ ఆఫ్ జాయినింగ్ సరిగ్గా లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి కారణం పీఎఫ్ అధికార యంత్రాంగమే అన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉద్యోగుల డేట్‌ఆఫ్ జాయినింగ్ సరిచేసి తగిన విధంగా పెన్షన్ వచ్చేలా చేయాలని కోరారు. అలాగే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన హయ్యర్ పెన్షన్ రాలేదని, ఆ పెన్షన్లు అప్లై చేసిన ఉద్యోగులకు రిటైర్ అయినట్లు మెయిల్స్, మెసేజీలు వచ్చాయని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. భెల్ ఇతర యూనిట్లలో హయ్యర్ పెన్షన్ వస్తుందని, విశాఖపట్నం యూనిట్లో రాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై పీఎఫ్ అధికారులు విశ్వనాథ్, వైభవ్, శివశంకర్ తదితర అధికారులకు సీఐటీయూ నాయకులు జి.టి.పి.ప్రకాష్, సీతన్నాయుడు, ఎస్.జగన్నాథరావు, పి.ఆనందకుమార్, కె.నారపురెడ్డి, అల్లు అప్పారావు, జి.అచ్చంనాయుడు తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు.



పీఎఫ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న భెల్ సీటు నాయకులు

దళితులపై దాడులు దారుణం



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

సీతంపేట: దళితుల బడ్జెట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో మూడు లక్షల మంది ఎస్సీ జనాభా ఉంటే, ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లు కేవలం నాలుగు వందల యూనిట్లు కేటాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంత్రులు ఉన్న నియోజకవర్గాలలో దళితులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, పిఠాపురం, పాయకరావుపేట, తెనాలి నియోజకవర్గాల్లో దళితులపై దాడులు జరిగాయన్నారు. దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. దళితుల రక్షణకు ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజులు, గుడాల రాంబాబు, పిల్లి వీర్రాజు, ఎన్ఏడీ రాజ్, శ్రీనివాస్, పిల్లి రాము, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చదరంగంలో ఉచిత శిక్షణ

మురళీనగర్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో బాలబాలికలకు చదరంగం క్రీడపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్, కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 తేదీ నుంచి ప్రతిరోజూ సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు కోచ్ సనపల ఉమాపతి శిక్షణ ఇస్తారన్నారు.వివరాలకు 7659804633 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు పెయింటింగులో శిక్షణ



తాము గీసిన ఇంద్ర ధనుస్సులను చూపుతున్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పెయింటింగుపై శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జి.ఎస్.ఎన్.మూర్తి, రచయిత కొప్పుల కాశీ విశ్వేశ్వరరావు, రమణయ్య మాస్టర్ పాల్గొని పుస్తక పఠనం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఇంద్ర ధనస్సులోని ఏడు రంగులతో విద్యార్థులు పెయింటింగు వేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిణి వై.పద్మజ పర్యవేక్షించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిషోయి, జీఆర్‌పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన పుగాజ్హేందీ తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, రూ. 35 వేల విలువైన 7 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యోగ సిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్-2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామికి మంగళవారం ఆలయ అర్చకుడు ఆరవెల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సింధూర అర్చన, తమలపాకుల పూజ నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక సుందర కాండ పారాయణం చేశారు. యోగసిద్ధాంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా యోగా సాధన



యోగా సాధన చేస్తున్న పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నారాయణరావు, సిబ్బంది

మురళీనగర్: విశాఖపట్నంలో జూన్‌లో నిర్వహించనున్న జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వివిధ సంస్థల ప్రతినిధులు సాధన చేస్తున్నారు. వివిధ పాఠశాలలు, కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రత్యేక శిక్షకుల ఆధ్వర్యంలో సిబ్బంది యోగా సాధన చేస్తున్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఆధ్వర్యంలో వివిధ విభాగాల హెడ్‌లు, కాలేజీ అధ్యాపకులు, కార్యాలయం సిబ్బంది మంగళవారం యోగా సాధన చేశారు. విద్యార్థులు యోగా దినోత్సవంలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థుల ఉన్నతే లక్ష్యం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సెక్రటరీ సుగుణారెడ్డి

దాబాగార్డెన్స్: తమ కళాశాలల పిల్లలు చదువు పూర్తయి కళాశాల వదిలి వెళ్తున్నప్పుడు డిగ్రీతో పాటు ఓ కంపెనీలో ఉద్యోగం పొందిన సర్టిఫికెట్‌తో వెళ్లాలన్నదే ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్. శేషారెడ్డి లక్ష్యమని ఆ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి తెలిపారు. ఏయూ డిగ్రీ ఫలితాల్లో ఆదిత్య కళాశాల విద్యార్థులు పలు ర్యాంకులు సాధించిన విషయమై మంగళవారం రామ్‌నగర్ ఆదిత్య క్యాంపస్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. అనంతరం సుగుణారెడ్డి మాట్లాడుతూ ఏయూ పరిధిలో 190 కళాశాలలకు సంబంధించి ప్రకటించిన 20 ర్యాంకుల్లో 12 ర్యాంకులు ఆదిత్య విద్యార్థులే సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రకటించిన డిగ్రీ కోర్సు వివిధ విభాగాల్లో 1,2,3 ర్యాంక్‌లతో పాటు మొత్తం 12 ర్యాంకులు ఆదిత్య డిగ్రీ విద్యార్థులే కైవసం చేసుకున్నారని ఆమె పేర్కొన్నారు. 2024-25లో ఇప్పటి వరకు 15120 క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కైవసం చేసుకోవడమే కాక విద్యా ప్రమాణాల్లో కూడా మొదటి స్థానంలో నిలిచినందుకు ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఆమె అభినందించారు.

డాక్టర్ కృష్ణకు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సీతారామకృష్ణారావు

అల్లిపురం: నగరానికి చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్ట్, విద్యావేత్త డాక్టర్ ఎస్. సీతారామకృష్ణారావుకు విద్యా, మనో వైజ్ఞానిక శాస్త్ర, వ్యక్తిత్వ వికాస రంగాల్లో చేసిన కృషికి గాను ముంబైకి చెందిన అంతర్జాతీయ సంస్థ మోటివేషనల్ విజనరీ లీడింగ్ అవార్డ్స్ ట్రస్ట్ (ఎంవీఎల్‌ఏ ట్రస్ట్) 'గ్లోబల్ బెస్ట్ ప్రొఫెసర్ గోల్డెన్ పీకాక్ అవార్డు 2025' ప్రదానం చేశారు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో గల ఒక హోటల్లో నిర్వహించిన అవార్డుల బహూకరణ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ఎస్. అమోల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ అమోల్ మాట్లాడుతూ గ్లోబల్ టీచర్స్-అచివర్స్ అవార్డ్స్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన విద్యా, సైకాలజీ తదితర అంశాల్లో కృషి చేస్తున్న ప్రముఖులను గుర్తించి ఈ అవార్డులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సంవత్సరం దేశంలో 12 మంది, అమెరికా, ఇంగ్లండ్, కెనడా, శ్రీలంక తదితర 16 దేశాల నుండి 26 మందిని గుర్తించి అవార్డులు అందజేసినట్లు తెలిపారు. అవార్డు గ్రహీత డాక్టర్ కృష్ణను లాఫ్టర్స్ ఫన్ క్లబ్ సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత కోరుకొండ రంగారావు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత వేముల భాస్కరాచారి, సంస్కృతీ స్వచ్ఛంద సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్. సత్యవరప్రసాదరావు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ 2025లో మొత్తంగా నాలుగు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయని, అందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు మోటివేషనల్ విజనరీ లీడింగ్ అవార్డ్స్ ట్రస్ట్ ప్రతినిధులకు, సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నిత్యావసర సరకుల వితరణ



వృద్ధులకు నిత్యావసర సరకులు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు మంగళవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు అవసరమైన నిత్యావసర సరుకులు, పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు అందించారు. ప్రభావతి మనుమడు అభిరామ్ కార్తికేయ పుట్టిన రోజు సందర్భంగా ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, పి.సూర్యనారాయణ, వృద్ధాశ్రమం నిర్వాహకుడు ఆర్.శ్రీనివాస్, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.జయ, సంయుక్త కార్యదర్శి జి.శిరీష లత, బులెటిన్ ఎడిటర్ సీహెచ్ పద్మావతి, కార్యవర్గ సభ్యులు ఆర్.స్నేహలత, జి.మంగాదేవి, కె.బిందురాణి, కె.వినీల, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.